క్లుప్తంగా

పేదల కుటుంబాల్లో వెలుగులు


రొంగలినాయుడుపాలెంలో మాట్లాడుతున్న సర్పంచ్ పైడితల్లమ్మ

కె.కోటపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గ్రామాల్లో అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలతో పేద కుటుంబాల్లో భరోసా కలుగుతుందని సర్పంచ్ పైల పైడితల్లమ్మ అన్నారు. గురువారం రొంగలినాయుడుపాలెంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో జలజీవన్ మిషన్ నిధులతో ఇంటింటి కుళాయిల ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే వచ్చి వైద్యం అందిస్తున్నట్లు చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల తెలిపారు. ఏపీఎం వెంకటలక్ష్మి, ఎంపీటీసీ గొర్రుపోటు రామలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి భీమరాజు పాల్గొన్నారు.

ఒక్కొక్కరిగా విధుల్లోకి చేరుతున్న అంగన్‌వాడీలు


గ్రామ పెద్దలు, మహిళా పోలీసు సమక్షంలో విధుల్లోకి చేరిన కార్యకర్తలు, ఆయాలు

నర్సీపట్నం: సమ్మె విరమించి అంగన్‌వాడీ వర్కర్లు ఒక్కొక్కరిగా విధుల్లోకి చేరుతున్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఐసీడీఎస్ అధికారులు సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ వర్కర్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. దీంతో నర్సీపట్నం మండలంలోని గబ్బాడ-1 కార్యకర్త, మెట్టపాలెం- 1, 2 కేంద్రాల కార్యకర్తలు, ఆయాలు విధుల్లోకి చేరుతున్నట్లు సీడీపీవో కార్యాలయంలో లిఖిత పూర్వకంగా రాసిచ్చారు. మెట్టపాలెంలో గ్రామ పెద్దలు తాతాజీ, రాంబాబు, సత్తిబాబు, సచివాలయ మహిళా పోలీసు అరుణ సమక్షంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సత్యవతి, వెంకటలక్ష్మి, ఆయాలు వరలక్ష్మి, రాజ్యలక్ష్మి విధుల్లోకి చేరారు.

పాడి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు


ఎం. కోడూరులో పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

మాడుగుల రూరల్: మండలంలోని మూడు గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఇందులో భాగంగా గురువారం ఎం. కోడూరులో పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు ప్రారంభించారు. పశువైద్యాధికారి అరుణ్‌కుమారి 55 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. శంకరంలో 95 పశువులకు, ఒమ్మలిలో 50 పశువులకు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో ఎం.కోడూరు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొల్లవిల్లి రాజేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, రాయపురెడ్డి కొండలరావు, పశువైద్య సిబ్బంది చంద్రరావు, అర్జున్‌రావు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

బుచ్చెయ్యపేట: మద్యం విక్రేతను అరెస్టు చేసినట్లు ఎస్ఐ డి. ఈశ్వరరావు తెలిపారు. గురువారం సాయంత్రం ఎక్సైజ్ అధికారులు, తమ సిబ్బందితో మద్యం అక్రమ అమ్మకాలుపై తనిఖీలు చేశామన్నారు. బుచ్చెయ్యపేట గ్రామ శివారులో మద్యం అమ్ముతున్న నిందితుడిని పట్టుకుని, 14 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఊరెళ్లేవారు సమాచారం ఇవ్వండి


సీఐ శ్రీనివాసరావు

చోడవరం రూరల్: సంక్రాంతి పండగ సెలవుల్లో బంధువులు ఇంటికి లేదా స్వగ్రామాలకు వెళ్లే వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని చోడ వరం సీఐ బి.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. తాళం వేసిన ఇళ్లను గమనించి చోరీలకు పాల్పడే అవకాశం ఉన్నందున పొరుగు గ్రామాలకు వెళ్లే వారు విలువైన బంగారు ఆభరణాలను తమ వెంట తీసుకెళ్లాలని సూచించారు. తాళం వేసిన సమాచారం తమ శాఖకు తెలియపరిస్తే ఆ ఇంటిని లాకింగ్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) ద్వారా అనుసంధానం చేస్తామని, దీని వల్ల చోరీకి పాల్పడే అవకాశం లేకుండా చూడవచ్చన్నారు.

రబీకి కలిసొచ్చిన తుఫాన్ వర్షం

- నిండుగా చెరువులు, బావులు, రిజర్వాయర్లు
- పుష్కలంగా సాగునీరు
- పెరగనున్న సాగు విస్తీర్ణం
- ఆర్బీకేల్లో ముందుగానే విత్తనాల పంపిణీ


కొండెంపూడిలో రబీ నాట్లుకు వేసిన ఆకుమడి


ఆర్.శివరాంపురం చెరువులో జలకళ


పేటలో రైతులు వేస్తున్న చెరుకు నాట్లు

బుచ్చెయ్యపేట: మిచాంగ్ తుపాను వర్షం రబీ సాగుకు కలిసొచ్చింది. చెరువులు, బావులు, రిజర్వాయర్లలో సాగునీరు పుష్కలంగా ఉండటంతో రైతులు హుషారుగా సాగుకు ఉపక్రమించారు. దాంతో ఈ దఫా పంట విస్తీర్ణం పెరగనుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

గత నెల మిచాంగ్ తుఫాన్‌కు అన్ని గ్రామాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. ఎర్రవాయి ప్రాంతమైన బుచ్చెయ్యపేట మండలంలోనే అత్యధిక వర్షపాతం నమోదైంది. ఈ వర్షంతో చెరువులు, రిజర్వాయర్లలో పుష్కలంగా నీరు చేరింది. గెడ్డలు, వాగులు, నదులు నీటితో నిండుగా ప్రవహించాయి. భూగర్భ జలాలు పెరగడంతో అన్ని గ్రామాల్లో చెరువులు, వ్యవసాయ బావులు నీటితో కళకళలాడుతున్నాయి. అధికారులు పెద్దేరు, కోనాం రిజర్వాయర్ల గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. దాంతో పుష్కలంగా సాగునీరు ఉండటంతో పలు గ్రామాల్లో రైతులు హుషారుగా రబీ సాగుకు ఉపక్రమించారు. వరి, చెరుకు పలు రకాల అపరాలతోపాటు కూరగాయల సాగు చేపడుతున్నారు.

ఖరీఫ్ లోటు పూడ్చుకోవడానికి...

ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలను వ్యవసాయ శాఖ సిబ్బంది సరఫరా చేశారు. 18 క్వింటాళ్ల వరి విత్తనాలతోపాటు 600 కేజీల మినుములు, 200 కేజీల పెసర్లు, 170 బస్తాలు వేరుశనగతోపాటు పలు రకాల విత్తనాలను రైతులకు సబ్సిడీపై పంపిణీ చేశారు. కొంత మంది రైతులు సొంతంగా పలు రకాల విత్తనాలను తయారు చేసుకుని వినియోగించుకుంటున్నారు. పొలం దుక్కులు దున్ని, దమ్ములు చేసి వరి ఆకులు వేయడం, చెరకు నాట్లు నాటడం చేస్తున్నారు. మినుము, పెసర, నువ్వులు, వేరుశనగ, కంది తదితర విత్తనాలను జల్లుతున్నారు. ఖరీఫ్ సీజన్ ఆఖరిలో వాతావరణం అనుకూలించక సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పలు గ్రామాల్లో వేసిన వరితోపాటు ఇతర పంటలు దెబ్బతిన్నాయి. ఖరీఫ్ పంట నష్టాన్ని పూడ్చుకోవడానికి పలు గ్రామాల్లో రబీ సాగుపై దృష్టి సారించారు. 3 వేల ఎకరాల్లో వరి, 2 వేల ఎకరాల్లో అపరాలు, 600 ఎకరాల్లో కూరగాయల సాగు చేపడుతున్నట్లు వ్యవసాయశాఖ సిబ్బంది అంచనా వేశారు.


నిండుగా నీలకంఠాపురంలో వ్యవసాయ బావి

సాగునీటికి ఢోకా లేదు



నెల రోజుల క్రితం కురిసిన వర్షం రబీ పంటలకు అనుకూలించింది. అన్ని గ్రామాల్లో రైతులు రబీ సాగు చేస్తున్నారు. వారికి అవసరమైన విత్తనాలను ముందుగానే రప్పించి రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేశాం. సాగు నీటికి ఢోకా లేకపోవడంతో రబీ సాగు విస్తీర్ణం పెరగనుంది. ఇప్పటికే అన్ని గ్రామాల్లో మా సిబ్బంది అందుబాటులో ఉంటూ తగు సూచనలు, సలహాలు అందించేలా చర్యలు చేపట్టాం.

– భాస్కరరావు, ఏవో, బుచ్చెయ్యపేట

నాలుగున్నరేళ్లలో ఎంతో అభివృద్ధి


భీమబోయినపాలెంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

మాకవరపాలెం: నాలుగున్నరేళ్లలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశారని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. మండలంలోని భీమబోయినపాలెం, తామరం గ్రామాల్లో రూ.20.8 లక్షల చొప్పున ఖర్చు చేసిన నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు గ్రామస్థాయిలోనే అన్ని రకాల సేవలందాలనే ఉద్దేశంతో గ్రామ సచివాలయ, రైతు భరోసా, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రాష్ట్రంలో గత 72 ఏళ్లలో 11 మెడికల్ కళాశాలలే ఉండేవని, తమ ప్రభుత్వంలో నాలుగేళ్లలో 17 మెడికల్ కళాశాలలను తీసుకువచ్చినట్టు చెప్పారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిని అందరూ గుర్తించాలన్నారు. మరలా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, వైస్ ఎంపీపీలు లక్ష్మి, రాజారావు, తూర్పుకాపు సంఘం మండలాధ్యక్షుడు హరిబాబు, సచివాలయ మండల కన్వీనర్ రమణ, ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గొర్లి వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బొడ్డు గోవిందరావు, యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, నాయకులు పెట్ల భద్రాచలం, తామరం సర్పంచ్ చెల్లారత్నం, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు'

దేవరాపల్లి: స్థానిక గ్రామ సచివాలయం- 2 పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరై గడప గడపకు తిరిగి సంక్షేమ లబ్ధిని వివరించి బుక్‌లెట్లు అందజేస్తారన్నారు.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

దేవరాపల్లి: మండలంలోని నాలుగు గ్రామాలల్లో శుక్రవారం పలు అభివృద్ధి పనులను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రారంభిస్తారని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు గురువారం తెలిపారు. రైవాడ, గరిశింగి గ్రామాల్లో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నూతన భవనాలను, బేతపూడి, ఎ. కొత్తపల్లి గ్రామాల్లో నూతన మంచినీటి పథకాలను ప్రారంభిస్తారన్నారు.

రసవత్తరంగా 'ఆడుదాం..ఆంధ్రా' పోటీలు

- ఉత్తమ ప్రదర్శనతో ఆకట్టుకుంటున్న క్రీడాకారులు


కె.కోటపాడులో కబడ్డీ పోటీలు


కె.కోటపాడు: ఉత్సాహంగా మహిళా క్రికెట్ పోటీలు


రోలుగుంటలో ఉత్సాహంగా కబడ్డీ ఆడుతున్న మహిళలు


బుచ్చెయ్యపేట: దిబ్బిడిలో విద్యార్థుల మధ్య హోరాహోరీగా కబడ్డీ

బుచ్చెయ్యపేట: దిబ్బిడి జెడ్పీ హైస్కూల్లో మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. రెండో రోజు గురువారం వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు హోరాహోరీగా సాగాయి. రాజాం, సీతయ్యపేట, తురకలపూడి, విజయరామరాజుపేట, వడ్డాది, పెదమదీన, కందిపూడి, దిబ్బిడి, ఆర్. భీమవరం, శింగవరం తదితర గ్రామాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించారు. ప్రతిభ చూపిన వారిని నాయకులు అభినందించారు.

కె.కోటపాడు: ఆడుదాం..ఆంధ్రా పోటీల్లో భాగంగా స్థానిక హైస్కూల్‌లో కబడ్డీ, వాలీబాల్, మహిళా క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోలుగుంట: రెండ రోజు గురువారం కొమరవోలు జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఆటగాళ్లు తమ ప్రతిభ చూపించారు. పీఈటీలు ఆర్.రాజులమ్మ, గోవింద పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శులు రవి కిరణ్, లాలం శివ క్రీడాకారులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

గొలుగొండ: ఆడుదాం- ఆంధ్రా కార్యక్రమం రెండో రోజు స్థానిక గురుకుల కళాశాలలో గురువారం నిర్వహించారు. మండలం నుంచి కబడ్డీ క్రీడకు నాలుగు టీమ్‌లు హాజరయ్యాయి. వాలీబాల్‌కు రెండు టీమ్‌లతో క్రీడలు రసవత్తరంగా జరిగాయి. పీఈటీ రమణ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి.


బుచ్చెయ్యపేట: దిబ్బిడిలో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు


బుచ్చెయ్యపేట: దిబ్బిడిలో రసవత్తరంగా ఖోఖో పోటీ


బుచ్చెయ్యపేట: వాలీబాల్, కబడ్డీ పోటీలకు వచ్చిన దిబ్బిడి క్లస్టర్ విద్యార్థులు

మేలుజాతి దూడల ప్రదర్శన


మేలు జాతి దూడలు పరిశీలిస్తున్న ఎంపీపీ

చీడికాడ: మేలుజాతి దూడల పోషణ పట్ల రైతులకు అవగాహన అవసరమని ఎంపీపీ కురచా జయమ్మ అన్నారు. ఖండివరంలో మండల స్థాయి లేగదూడల ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ జాతులకు చెందిన 40 లేగ దూడలను జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టరు బి.రామమోహన్‌రావుతో కలిసి పరిశీలించారు. మెరుగైన దూడల పోషణను చేసిన రైతులు సింగంపల్లి కొండబాబు, జూరెడ్డి గోవిందరావు, డోకల నాయుడు, గడెం చిలుకులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులు అందజేశారు.

కార్యక్రమంలో ఎంపీటీసీ గెంజి స్వాతి బాలాజీ, మాడుగుల పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టరు చిట్టినాయుడు, పశువైద్యులు మణిలక్ష్మణ్, అరుణ్‌కిరణ్, గణేష్ పాల్గొన్నారు.

రోలుగుంటకు చేరిన రామభక్తుల పాదయాత్ర


రోలుగుంటలో పాదయాత్రగా వెళ్తున్న చింతపల్లి భక్త బృందం

రోలుగుంట: అయోధ్య రామ మందిరంలో ఈ నెల 22న నూతన విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం విజయవంతం చేయాలని అల్లూరి జిల్లా చింతపల్లికి చెందిన రామభక్త బృందం విశాఖ జిల్లా సింహాచలం వరకు చేపట్టిన పాదయాత్ర గురువారం రోలుగుంట చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక కల్యాణార్థం సనాతన ధర్మం పరిరక్షణార్థం ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. భక్తులు పెద్ద ఎత్తున అయోధ్యకు తరలిరావాలని కోరారు.

తూర్పు కాపు సంఘం మండలాధ్యక్షుడిగా పుల్లేటి



చోడవరం రూరల్: తూర్పు కాపు సంఘం చోడవరం మండలాధ్యక్షునిగా పుల్లేటి గణేష్ నియమితులయ్యారు. అనకాపల్లి జిల్లా సంఘం నాయకుల సమక్షంలో ఈ నియామకం చేసినట్టు శ్రీహరి గురువారం తెలిపారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నానాజీ, శేషగిరిరావు, కాపు నాయకులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు ఆసరా

నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్


బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ చొరవతో నియోజకవర్గంలోని ఎంతో మంది అభాగ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆసరాగా నిలుస్తోంది. నాతవరం మండలం చమ్మచింత గ్రామానికి చెందిన ఎందుర్తి అమ్మన్న ఇటీవల అనారోగ్యంతో చనిపోయింది. ఆమె కుటుంబానికి రూ.3 లక్షలు, గుండె వ్యాధితో బాధపడుతున్నందున మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లికి చెందిన మంగాదేవికి రూ.2లక్షలు, సుబ్బారాయుడుపాలెం తమరాన సంధ్యకు రూ.52 వేల చొప్పున మొత్తం రూ.5.52 లక్షల చెక్కులను బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఉన్నీషా బేగం, సచివాలయాల మున్సిపల్ కన్వీనర్ తమరాన శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా, పార్టీ నాతవరం మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ మైనం గోపి, పెట్ల అప్పలనాయుడు, నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయండి


మాట్లాడుతున్న పంచాయతీ విస్తరణాధికారి మూర్తి

నాతవరం: గ్రామ పంచాయతీలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి కావలసిన వనరులపై శాఖల వారీగా ప్రణాళిక సిద్ధం చేయాలని పంచాయతీ విస్తరణాధికారి ఎస్.ఎస్.మూర్తి తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024- 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీలో శాఖల వారీగా ప్రణాళిక తయారు చేసే బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సమగ్ర సమాచారం నివేదిక ద్వారా పంచాయతీలకు సకాలంలో అందించాలన్నారు. అనంతరం కార్యదర్శులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, జేఈలు రాజేష్, వెంకటేశ్వరమ్మ, వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి, ఉపాధి ఏపీవో చిన్నారావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమ్మె విరమించి.. విధుల్లోకి సీఆర్పీలు


విధుల్లోకి చేరుతున్నట్లుగా ఎంఈవోలకు రిపోర్టు ఇస్తున్న సీఆర్పీలు, ఇతర సిబ్బంది


రిజిస్టర్‌లో సంతకాలు చేసి విధుల్లోకి చేరిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

నాతవరం: సీఆర్పీల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో సమ్మె విరమించి విధుల్లోకి చేరారని ఎంఈవో తాడి అమృత్‌కుమార్ అన్నారు. గురువారం మండల విద్యా శాఖ కార్యాలయంలో ఎంఈవోకు సీఆర్పీలు, ఇతర ఔట్‌సోర్సింగ్ సిబ్బంది జాయినింగ్ రిపోర్టు అందజేశారు. అనంతరం ఎంఈవో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి పెండింగ్ పనులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని ఆదేశించారు. నేటి నుంచి విద్యా శాఖకు సంబంధించి పనులన్నీ యథావిధిగా జరుగుతాయన్నారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయులు గ్రహించి నాడు – నేడు పనులు వేగవంతం చేయాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తమ సమస్యలపై స్పందించినందుకు సీఆర్పీల యూనియన్ మండలాధ్యక్షుడు పోలుపర్తి నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. తమ డిమాండ్లను నిబంధనల ప్రకారం దశల వారీగా పరిష్కరించేందుకు అంగీకారం తెలిపారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో -2 కామిరెడ్డి వరహాలబాబు, సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఫలించిన సమగ్ర శిక్ష ఉద్యోగుల చర్చలు

రోలుగుంట: అధికారులు, మంత్రులతో చర్చలు సఫలం కావడంతో సర్వశిక్ష ఉద్యోగులు తమ సమ్మె విరమించుకుని గురువారం విధుల్లో చేరారు. వీరి సమస్యలపై యూనియన్ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు గత నెల 20న ఆందోళన చేపట్టి విధులు బహిష్కరించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం, మంత్రులతో చర్చలు సఫలమయ్యాయి. దీనిపై వారు సంతృప్తి వ్యక్తం చేస్తూ ఎంఈవో- 1 జానుప్రసాద్‌కు లేఖను అందజేసి గురువారం విధుల్లో చేరారు.

రోగి ఇంటి వద్దకే వైద్య సేవలు


కొండపాలెంలో రోగి వద్దకు వెళ్లి మందులు అందిస్తున్న వైద్య సిబ్బంది

రోలుగుంట: ఆరోగ్య గ్రామాలుగా తయారు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోంది. గ్రామస్థాయిలో జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య నిపుణలతో ఉచితంగా ఖరీదైన రోగ నిర్ధారణ పరీక్షలు, అవసరమైన వైద్యం చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తోంది. ఇటీవల మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించి, ఈ నెల 5వ తేదీ నుంచి రెండో విడత కార్యక్రమాలను చేపట్టింది. ఈ శిబిరంలో 160 మంది రోగులకుపైగా పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరిలో ఇదే గ్రామానికి చెందిన కర్రి అప్పారావు అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యాడు. గురువారం ఎంపీహెచ్‌ఈవో కృష్ణ అతడి ఇంటికెళ్లి వైద్యం చేసి, మరో వారానికి సరిపడ మందులు అందజేశారు. దీంతో తన వద్దకు వచ్చి వైద్యం అందించడంపై సదరు రోగి ఆనందం వ్యక్తం చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపాడు.

బెల్లం పాక దగ్ధం


కశింకోటలోని పొలాల్లో కాలిపోతున్న బెల్లం పాక

కశింకోట : స్థానిక శారదా నది అవతల ఉన్న పొలాల్లో గురువారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో బెల్లం పాక దగ్ధమైంది. సుమారు రూ. రెండు లక్షల ఆస్తి నష్టం జరిగిందని అంచనా. బొడ్డేడ శ్రీనుకు చెందిన బెల్లం తయారీ పాకకు అకస్మాత్తుగా నిప్పు అంటుకుని కాలిపోయింది. పాకలో తయారు చేసిన రెండు పాకాల బెల్లం కూడా ఆహుతైంది. రెండు మోటార్లు కాలిపోయాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల గాని, ప్రమాదవశాత్తు గానీ అగ్ని ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. అనకాపల్లి నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రమాద స్థలాన్ని వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు పరిశీలించారు.

ఇద్దరి చిన్నారులకు గాయాలు


గాయాలతో చిన్నారులు

చీడికాడ: మండలంలోని తునివలస గ్రామానికి చెందిన గోటాలు మురళికి పిల్లలకు గాయాలయ్యాయి. గురువారం సాయంత్రం గ్రామంలో రోడ్డు పక్కన వేసిన చెత్తకు నిప్పంటించగా, అందులో కరెంటు బల్బు, ఇతర సీసాలు పగిలి పేలాయి. అతని కుమార్తె త్రిలోక్యకు తీవ్రంగా, కుమారుడు నిహాల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే చోడవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించారు.